క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

వలిగొండ : మండలంలోని అరూర్, పులిగిల్ల సబ్‌స్టేషన్‌లో పరిధిలోని గ్రామాల్లో మరమ్మతులు చేపడుతున్న సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ నర్సింహ శనివారం తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

రికార్డుల పరిశీలన



రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీఓ శేఖర్‌రెడ్డి

చౌటుప్పల్ : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని శనివారం ఆర్డీఓ వెల్మ శేఖర్ రెడ్డి సందర్శించారు. ఇటీవల నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సులకు సంబంధించిన ఫైళ్లను పరిశీలించి తగిన సూచనలు చేశారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్ పజ్జూరు సిద్ధార్థకుమార్, తదితరులు ఉన్నారు.

రెవెన్యూ డివిజన్ ప్రకటించకపోతే ఆందోళనలు చేస్తాం

ఆలేరు: ఆలేరు నియోజకవర్గ కేంద్రాన్ని రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని అఖిలపక్ష కమిటీ కన్వీనర్ పసుపునూరి వీరేశం డిమాండ్ చేశారు. శనివారం ఆలేరు పట్టణంలోని ఆర్య వైశ్య భవన్‌లో నిర్వహించిన అఖిలపక్ష కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య రెవెన్యూ డివిజన్ ఏర్పాటుపై ఇచ్చిన హామీని నెరవేర్చడంలో జాప్యం చేస్తున్నారని విమర్శించారు. స్పష్టమైన నిర్ణయాన్ని ప్రకటించకపోతే అఖిలపక్షం ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో కమిటీ కోకన్వీనర్లు చెక్క వెంకటేష్, రాచకొండ జనార్దన్, మొరిగాడి చంద్రశేఖర్, నంద గంగేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి కృషి

రామన్నపేట : గ్రామాభివృద్ధికి కృషిచేస్తానని జిల్లా కాంగ్రెస్ నాయకుడు కూనూరు సాయికుమార్ గౌడ్ తెలిపారు. శనివారం రామన్నపేట మండలంలోని బోగారం గ్రామంలో రూ.30వేల తన సొంత నిధులతో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో అంతటి మల్లేష్, గోగు సత్తయ్య, కట్ట పాండురంగారెడ్డి, ఇప్ప పాండురంగారెడ్డి బి.నర్సింహ, కదారి పాపయ్య, మద్దెపురి ఐలయ్య, శ్రీనివాస్, శంకరయ్య, సాంబయ్య పాల్గొన్నారు.

బీసీల మహాసభ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

సంస్థాన్ నారాయణపురం: హైదరాబాద్‌లో ఈ నెల 15న జరిగే బీసీల మహాసభను విజయవంతం చేయాలని కోరుతూ బీసీపీఎఫ్ ఆధ్వర్యంలో శనివారం సంస్థాన్ నారాయణపురంలో వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్‌పై చట్టబద్ధత కల్పించిన తర్వాత స్థానిక ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరం జేఏసీ అధ్యక్షుడు సుర్వి యాదయ్య, తెలంగాణ భిక్షం, వడ్డెపల్లి రాములు, రాసాల వెంకటేష్, ఉప్పల శ్రీను, జక్కిడి బాల్‌రెడ్డి, నర్సింహ, యాదగిరి, అంజిసాగర్, బాలకృష్ణ, జాని, చంద్రయ్య, ముత్యాలు తదితరులున్నారు.

నోముల రామిరెడ్డికి నివాళి

వలిగొండ : నోముల రామిరెడ్డి వర్ధంతి సందర్భంగా సందర్భంగా వలిగొండ మండలంలోని సంగం గ్రామం వద్ద ఆయన స్థూపానికి సీపీఎం ఆధ్వర్యంలో నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మాటూరి బాల్ రాజు, మండల కార్యదర్శి సిర్పంగి స్వామి, ఏనుగు సాయి రెడ్డి, సురకంటి వెంకట్ రెడ్డి, కేసరి రాంరెడ్డి, బద్దం సంజీవ రెడ్డి, ఉండాడి సత్యనారాయణ, వారికుప్పల మల్లేశం, భీమనబోయిన జంగయ్య, నర్సింహ, రాంరెడ్డి, జంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక డంప్ స్వాధీనం

ఆలేరురూరల్: ఆలేరు మండలం కొలనుపాగ గ్రామానికి చెందిన మాస్పెట ప్రశాంత్ అనే వ్యక్తి ఎలాంటి అనుమతులు లేకుండా వాగులో నుంచి ఇసుకను ట్రాక్టర్ల ద్వారా తరలించి కొలనుపాక గ్రామ శివారులో డంప్ చేసి విక్రయిస్తున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు శనివారం అక్కడికి చేరుకుని డంప్ చేసిన ఇసుకను స్వాధీనం చేసుకుని ప్రశాంత్‌పై కేసు నమోదు చేసినట్లు ఆలేరు ఎస్‌హెచ్‌ఓ కొండల్‌రావు తెలిపారు.

నేడు విప్లవ వీరుల సంస్మరణ సభ

మోత్కూరు : భారత కమ్యూనిస్టు విప్లవ పంతా నిర్మాతలు, విప్లవ రథసారథులు అయిన దేవులపల్లి వెంకటేశ్వరరావు (డీవీ), తరిమెల నాగిరెడ్డి (టీఎన్)ల సంస్మరణ సభ హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఆదివారం నిర్వహించనున్నట్లు గ్రామీణ పేదల సంఘం జిల్లా అధ్యక్షుడు కొంగరి మల్లయ్య శనివారం తెలిపారు. ఈ సంస్మరణ సభకు ప్రముఖ విప్లవ కవి నిఖిలేశ్వర్ ఉపన్యాసకులుగా నవోదయ సాహితీ సాంస్కృతిక సమాఖ్య నాయకులు, ఓపీడీఆర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.విజయేందర్‌రావు, గ్రామీణ పేదల సంఘం రాష్ట్ర కార్యదర్శి జి.వెంకటాద్రి హాజరవుతున్నట్లు పేర్కొన్నారు.

పచ్చని బడి.. ప్రకృతి ఒడి



ఆలేరు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రహరీ వెంట ఉన్న చెట్లు

- పాఠశాల పరిసరాలను పచ్చదనంగా మార్చాలని ఎన్‌సీసీ అధికారి నిర్ణయం
- సీనియర్ విద్యార్థులను ప్రేరణగా తీసుకుని మొక్కలు నాటుతున్న నూతన విద్యార్థులు

ఆలేరు: ఆలేరు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన ఎన్‌సీసీ విద్యార్థులు తాము చదువుకున్న పాఠశాల పరిసరాలను పచ్చదనంగా మార్చాలనే ఉద్దేశంతో ఏళ్లుగా మొక్కలు నాటుతున్నారు. దాదాపు తొమ్మిదేళ్లుగా ఎన్‌సీసీ విద్యార్థులు ఒక బ్యాచ్ వెళ్లిపోయినా తరువాత మరో బ్యాచ్ విద్యార్థులు దీనిని కొనసాగిస్తున్నారు. 2016లో పాఠశాలలో ఎన్‌సీసీ అధికారిగా దూడల వెంకటేష్ నియామకయ్యారు. ఇదే స్కూల్‌లో అక్షరాలు నేర్చుకున్న అతనికి స్కూల్ పరిసరాలు, గ్రౌండ్ చుట్టూ చిన్న మొక్క కూడా కనిపించలేదు. దీంతో మొక్కలు నాటి పరిసరాలను పచ్చదనంగా మార్చాలని నిర్ణయించాడు. అందులో భాగంగానే స్కూల్‌కు వచ్చిన ప్రతి బ్యాచ్ మొక్కలు నాటే కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు.

నాటిన మొక్కలను బతికించడమే లక్ష్యం



మొక్కలు నాటడం కాదు. వాటిని బతికించడమే లక్ష్యంగా పెట్టుకోవాలని ఎన్‌సీసీ విద్యార్థులకు చెబుతుంటాను. విద్యార్థులు వంతుల వారీగా మొక్కలకు నీళ్లు పోయడం, వాటికి రక్షణగా కంచెలు ఏర్పాటు చేయడం, మొక్కల చుట్టూ పిచ్చిగడ్డి లేకుండా చేయడంతో మొక్కలు పెరిగి పెద్దయ్యాయి.

– దూడల వెంకటేష్, ఎన్‌సీసీ అధికారి

విద్యార్థి దశ నుంచే మొక్కల పెంపకం

బొమ్మలరామారం: మండలంలోని జలాల్‌పూర్ జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు ఉపాధ్యాయ బృందం విద్యతో పాటు మొక్కల ఆవశ్యకతపై అవగాహన కల్పిస్తున్నారు. మొక్కలపై మక్కువ పెంచుకునేలా నర్సరీల నుంచి మొక్కలను తీసుకువచ్చి పాఠశాలలో వారి చేత నాటించి సంరక్షణ బాధ్యతలు అప్పగిస్తున్నారు. ఇటీవల మొక్కల సంరక్షణపై మరింత శ్రద్ధ కనబరిచేలా అమ్మ పేరుతో మొక్కలను నాటే కార్యక్రమం చేపట్టారు. దీంతో విద్యార్థులు మొక్కలను కంటికి రెప్పలా కాపాడుతున్నారు.



పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు

మొక్కలతో స్వాగతం



ధనలక్ష్మి ఇంటి ఆవరణలో పూల మొక్కలు

ఆలేరురూరల్: ఆలేరులోని ముల్లెక్కల ధనలక్ష్మి తన ఇంటి ఆవరణలో దాదాపు 150 రకాలు పూలు, పండ్లు, రుద్రాక్ష, వాటర్ ఫీల్, ఆవకాడ, రెడ్ ఆపిల్, పనస, హైబ్రీడ్ మామిడి, డ్రాగెన్ ఫ్రూట్స్, సపోట, బాదం కారక్కాయ మొక్కలతోపాటు, పూల మొక్కలు పెంచుతున్నారు. సంవత్సరానికి ఒకసారి పుష్పించే బ్రహ్మ కమలం మొక్క తోటలో ఆకర్షణగా ఉంటుంది. ఇంట్లోకి వెళ్లే వారికి మొక్కలే స్వాగతం పలుకుతాయి.



విరబూసిన బ్రహ్మ కమలం

కార్యాలయం.. ఆహ్లాదకరం

గుండాల : మండల కేంద్రంలోని తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయాల ఆవరణలో 2007లో అప్పటి ఎంపీడీఓ ప్రకాష్‌రావు సుమారుగా 200 మొక్కలను నాటించారు. నేడు అవి ఏపుగా పెరిగి రెండు కార్యాలయాల ఆవరణలో ఆహ్లాదకరంగా మారాయి. కార్యాలయాలకు పనుల నిమిత్తం వచ్చిన ప్రజలు చెట్ల కింద సేద తీరుతున్నారు. ప్రజలు కూర్చునేందుకు ఇటీవల దాతలు బెంచీలు బహూకరించారు. గతంలో ఇక్కడ పని చేసిన ఇన్‌చార్జ్ తహసీల్దార్ మన్నాన్ వేసవిలో పక్షులు నీరు తాగేందుకు చెట్లపై నీటి తొట్లను ఏర్పాటు చేయించారు.



ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో ఇరువైపులా ఉన్న చెట్లు

ఇందిరమ్మ ఇళ్లకు సరఫరా చేసే ఇసుక ట్రాక్టర్లను అడ్డుకోవద్దు

మోత్కూరు : ఇందిరమ్మ గృహ నిర్మాణాలకు తరలించే ఇసుక ట్రాక్టర్లను అడ్డుకోవద్దని భువనగిరి ఆర్డీఓ కృష్ణారెడ్డి సూచించారు. శనివారం మోత్కూరు తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. అనంతరం మున్సిపాలిటీ పరిధిలోని కొండగడప గ్రామంలో జరుగుతున్న ఇందిరమ్మ గృహ నిర్మాణ పనులను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎడ్ల బండ్ల ద్వారా తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసనకు దిగిన రైతుల తీరుపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. సొంత అవసరాలకే ఎడ్ల బండ్ల ద్వారా ఇసుకను వాడుకోవాలన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు ట్రాక్టర్ల ద్వారా ఇసుక సరఫరాకు అధికారులు అనుమతి ఇస్తే ఎడ్ల బండ్ల రైతులు గొడవకు దిగి అడ్డుకున్నారని ఇళ్ల లబ్ధిదారులు కొలపాక శంకరమ్మ, ఎర్రబెల్లి స్వప్న, ఎర్రబెల్లి శ్రీను ఆర్డీఓతో పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇసుక రవాణా ట్రాక్టర్లను అడ్డుకునే ఎడ్ల బండ్ల రైతులపై కేసులు నమోదు చేయాలని మోత్కూరు పోలీస్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లుకు ఫోన్‌లో సూచించారు. అనంతరం ఆర్డీఓ కృష్ణారెడ్డి తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సదస్సుల అర్జీలు పరిశీలించారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్ ఉపేందర్, మున్సిపల్ కమిషనర్ సతీష్‌కుమార్, గిరిధావర్లు ఉన్నారు.



కొండగడపలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ కృష్ణారెడ్డి

విద్యార్థులు ఇష్టంతో కష్టపడి చదవాలి

- కలెక్టర్ హనుమంతరావు

రామన్నపేట : వసతి గృహాల్లో వసతులను కల్పించే బాధ్యత ప్రభుత్వానిదని, కష్టపడి చదవాల్సిన బాధ్యత విద్యార్థులదని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. శనివారం రామన్నపేట సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహాన్ని ఆయన తనిఖీ చేశారు. విద్యార్థుల కోసం సిద్ధం చేసిన భోజనం, పరిసరాలను పరిశీలించారు. విద్యార్థుల విజ్ఞప్తి మేరకు బాత్‌రూమ్‌లు, ఫ్యాన్లు ప్యూరిఫైడ్ వాటర్‌ప్లాంట్‌కు మరమ్మతులు చేయిస్తానని, ఆట వస్తువులను సమకూరుస్తానని హామీ ఇచ్చారు. ఇష్టంతో ప్రణాళికాబద్ధంగా చదివి మంచి ఫలితాలను సాధించాలన్నారు. పదో తరగతిలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు సైకిల్ బహుమతిగా ఇవ్వడంతోపాటు, వారి తల్లిదండ్రులను సన్మానిస్తామని తెలిపారు. కోమల్ అనే విద్యార్థి పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలిపి చాక్లెట్లు పంపిణీ చేశారు.



రామన్నపేటలో వసతి గృహంలో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతరావు

క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలి

రామన్నపేట : భూ భారతి, రెవెన్యూ సదస్సుల దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ హనుమంతరావు ఆదేశించారు. శనివారం రామన్నపేట తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి, రికార్డులు పరిశీలించారు. భూ భారతి రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులు, స్థానిక అధికారులు తీసుకున్న చర్యలను ఒక్కొక్కటిగా పరిశీలించారు. ఆయనవెంట తహసీల్దార్ లాల్‌బహదూర్‌శాస్త్రి, డీటీ శైలజ, సీనియర్ అసిస్టెంట్ గాలయ్య, ఆర్‌ఐలు శోభ,, రాజేశ్వర్ ఉన్నారు.

దరఖాస్తులు పెండింగ్‌లో పెట్టొద్దు

వలిగొండ : రెవెన్యూ సదస్సులో వచ్చిన భూభారతి దరఖాస్తులను పెండింగ్ పెట్టకుండా పూర్తిచేయాలని కలెక్టర్ హనుమంత రావు అధికారులకు సూచించారు. శనివారం వలిగొండలోని తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ దశరథ, డిప్యూటీ తహసీల్దార్ పల్లవి, సీనియర్ అసిస్టెంట్ మనోహర్, ఆర్‌ఐలు నాగేష్, కరుణాకర్ రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

ఎరుకల హక్కుల సాధనకు ఉద్యమించాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

యాదగిరిగుట్ట: ఎరుకలు తమ హక్కులను సాధించే దిశగా ఉద్యమించాలని ఆల్ ఇండియా ఎరుకల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు మానుపాటి కృష్ణ ఎరుకల అన్నారు. శనివారం యాదగిరిగుట్టలో ఎరుకల హక్కుల పోరాట సమితి ఆవిర్భావ దినోత్సవ వాల్‌పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. హక్కుల సాధనకు ఎరుకలంతా ఏకతాటిపైకి రావాలన్నారు. వచ్చే నెల 3న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే ఆవిర్భావ దినోత్సవానికి తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు అంగడి కృష్ణ, బొలుగుల నర్సింహ, మానుపాటి పరుశరాం, జిల్లా నాయకురాలు బొలుగుల భాగ్య, మండల అధ్యక్షురాలు దేవరాయ మంజుల, నాయకులు తదితరులున్నారు.

సీఎం రేవంత్ చిత్రపటానికి పాలాభిషేకం

మోత్కూరు : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని నిర్ణయించడంపై శనివారం మోత్కూరు అంబేద్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే మందుల సామేల్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వంగాల సత్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు గుండగోని రామచంద్రు గౌడ్, మోత్కూరు మార్కెట్ కమిటీ చైర్మన్ విమలావెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు గుర్రం లక్ష్మీనర్సింహారెడ్డి, అవిశెట్టి అవిలుమల్లు, మందుల సురేష్, పట్టణ నాయకులు రాచకొండ బాలరాజు గౌడ్, గుండు శ్రీను, పల్లపు సమ్మయ్య, ముద్దం జయశ్రీ, అన్నెపు పద్మ, బందెల రవి, నర్సింహ పాల్గొన్నారు.

వలిగొండ : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని నిర్ణయించిన నేపథ్యంలో శనివారం వలిగొండ మండల కేంద్రంలో యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో నూతి రమేష్, పాశం సత్తిరెడ్డి, కుంభం వెంకటపాపిరెడ్డి, పబ్బు ఉపేందర్ బోస్, ఉలిపే మల్లేశం, కంకల కిష్టయ్య, బత్తిని లింగయ్య, మైసోల్ల ప్రవీణ్, బుగ్గ ఉదయ్, కాసుల వెంకన్న, కొండూరు భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

'మత్తు' నివారణపై అవగాహన కల్పించాలి



మోత్కూరులో కళా ప్రదర్శన

మోత్కూరు : మత్తు పదార్థాల నివారణకు కళా ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించాలని మోత్కూరు పోలీస్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. మోత్కూరు పోలీస్ స్టేషన్ ఆవరణలో శనివారం మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాల వినియోగాన్ని నిరోధించేందుకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలంలోని గోరంట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న రాచకొండ ప్రభాకర్ హాజరయ్యారు. ఆయన గత కొంత కాలంగా సామాజిక బాధ్యతతో వివిధ ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడాన్ని సీఐ అభినందించారు. తల్లిదండ్రులు, బోధన సంస్థలు, సమాజంలో ప్రతి ఒక్కరూ మత్తు వ్యసనాలను ఎదుర్కొనేందుకు కలిసి పని చేయాలన్నారు. మత్తు రహిత సమాజ నిర్మాణానికి పోలీసులు నిరంతరం అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐ కొంపెల్లి సతీష్, ఏఎస్‌ఐ వెంకన్న, హెడ్ కానిస్టేబుల్ నర్సింహ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

21న చలో కలెక్టరేట్

భువనగిరిటౌన్ : పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 21న కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టనున్నట్లు ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యురాలు మేడబోయిన మమత తెలిపారు. శనివారం భువనగిరి జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవన్ ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో జిల్లా ఉపాధ్యక్షుడు వేముల నాగరాజు అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర కమిటీ సభ్యురాలు మేడబోయిన మమత మాట్లాడుతూ.. స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ రాక విద్యార్థులు, ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు ఇబ్బందులు పడుతున్నాయన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి లావుడియ రాజు, జిల్లా ఉపాధ్యక్షుడు ఈర్ల రాహుల్, జిల్లా సహాయ కార్యదర్శి తిగుళ్ల శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు పుట్టల ఉదయ్, ఈర్ల కార్తీక్, భవాని శంకర్, ధరావత్ జగన్, బుగ్గ ఉదయ్ పాల్గొన్నారు.

రాచకొండ సీపీ తనిఖీ



సిబ్బందితో మాట్లాడుతున్న సీపీ సుధీర్‌బాబు

బొమ్మలరామారం: బొమ్మలరామారం పోలీస్‌స్టేషన్‌ను రాచకొండ కమిషనర్ సుధీర్‌బాబు శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో ప్రజలకు మరింత చేరువ కావాలన్నారు. క్రైమ్ రేట్ తగ్గించేందుకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట భువనగిరి డీసీపీ అక్షాంశ్ యాదవ్, ఏసీపీ రాహుల్ రెడ్డి, భువనగిరి రూరల్ సీఐ చంద్రబాబు ఉన్నారు.

నిరుపేద విద్యార్థికి ఆర్థిక చేయూత



రాకేష్‌కు ఆర్థికసాయం అందజేస్తున్న ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

ఆలేరురూరల్: ఆలేరు మండలం కొలనుపాక గ్రామానికి చెందిన రాకేష్ బీటెక్ చదివేందుకు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య తన నెల జీతంలో నుంచి రూ.10వేలను శనివారం ఆర్థికసాయంగా అందజేశారు. ఆర్థిక స్థోమత లేని నిరుపేద విద్యార్థులు చదువుకునేందుకు తప్పక ఆర్థికసాయం అందజేస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొండ్రాజు వెంకటేశ్వరరాజు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న కుల పెద్దలు

వలిగొండ : మండలంలోని లింగరాజుపల్లికి చెందిన గంగదారి ఉపేందర్ ఇటీవల గుండెపోటుతో మృతిచెందాడు. శనివారం గ్రామంలోని మృతుడి కులస్తులు బాధిత కుటుంబానికి అండగా నిలిచేందుకు మృతుడి కుమార్తెల పేరున రూ.71 వేలను బ్యాంక్‌లో డిపాజిట్ చేసి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బొడ్డుపల్లి ఉమాకృష్ణ, కుమ్మరి సంఘం అధ్యక్షుడు బొడ్డుపల్లి మహేష్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి అండగా నిలిచిన స్నేహితులు

అడ్డగూడూరు: మండలంలోని మంగమ్మగూడెం గ్రామానికి చెందిన డప్పు యాదగిరి (46) ఇటీవల మృతి చెందాడు. 1994–95 ఎస్ఎస్‌సీ బ్యాచ్‌కు చెందిన అతడి స్నేహితులు శనివారం యాదగిరి చిత్రపటానికి నివాళులర్పించారు. అతడి కుటుంబానికి రూ.80 వేలను ఆర్థికసాయంగా అందజేశారు. కార్యక్రమంలో తుప్పతి నర్సింహ, నారబోయిన మైసయ్య, లక్ష్మణ్, మల్లయ్య పాల్గొన్నారు.

బహుజన సమాజ్ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా వీరస్వామి

గుండాల : మండలంలోని పెద్దపడిశాల గ్రామానికి చెందిన గడ్డం వీరస్వామి బహుజన సమాజ్ పార్టీ ఆలేరు నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా నియామకమయ్యారు. శనివారం జరిగిన భువనగిరి జిల్లా సమీక్ష సమావేశంలో ఆ పార్టీ సెంట్రల్, స్టేట్ కోఆర్డినేటర్ దాగిల్ల దయానందరావు నియామక పత్రం అందజేశారు.

ఆంథోల్ మైసమ్మ ఆలయంలో నేడు బోనాలు



బోనాల మహోత్సవానికి ముస్తాబైన ఆలయం

చౌటుప్పల్ రూరల్: ఆషాడ మాసంలోని మూడో ఆదివారం సందర్భంగా నేడు చౌటుప్పల్ మండలం దండు మల్కాపురం గ్రామ పరిధిలో జాతీయ రహదారి పక్కన ఉన్న ఆంథోల్‌మైసమ్మ దేవాలయంలో బోనాల మహోత్సవం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా దేవాలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. మూడు రోజులపాటు జరిగే ఉత్సవాల్లో ప్రత్యేక పూజలు, అన్నదానం చేస్తారు. పండుగకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు భద్రతా చర్యలు చేపట్టారు.

భక్తులకు అసౌకర్యం కలగనీయం

ఆంథోల్‌మైసమ్మ దేవాలయంలో ప్రతి సంవత్సరం ప్రభుత్వం ఆధ్వర్యంలో బోనాల మహోత్సవం నిర్వహిస్తాం. హైదరాబాద్, ఆంధ్ర, తమిళనాడు, బెంగుళూర్‌తో పాటు చుట్టు ప్రక్కల గ్రామాల భక్తుల రాక పెరుగుతూనే ఉంది. వచ్చిన భక్తులకు అన్నదానం చేస్తున్నాం. ఎలాంటి అసౌకర్యం లేకుండా అన్ని ఏర్పాట్లు చేశాం.

– మోహన్‌బాబు, దేవాలయ కార్యనిర్వహణాధికారి

విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ

భువనగిరి: భువనగిరి వాసవి క్లబ్ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని సింగన్నగూడెంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం మున్సిపల్ కార్మికులు, పేపర్ బాయ్స్, పోస్ట్‌మెన్‌లను సన్మానించారు. వాసవీ క్లబ్ జిల్లా గవర్నర్ విజయలక్ష్మీ క్లబ్ ఆధ్వర్యంలో అనేక సామాజిక కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు రాచమల్ల అశోక్, అయిత రాములు, వెంకటేశ్వర్లు, బచ్చు రమేష్, హనుమంతరావు, సతీష్, రాము, జ్యోతి, రవీందర్, రాములు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు నోట్ పుస్తకాలను అందజేస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు

మట్టి రోడ్డే దిక్కు

- బీటీకి నోచుకోని చొల్లేరు- చీమలకొండూర్ రోడ్డు
- వాహనదారులకు తప్పనితిప్పలు

యాదగిరిగుట్ట రూరల్: ఏళ్లు గడుస్తున్నా పలు గ్రామాలకు ఉన్న మట్టి రోడ్లు బీటీకి నోచుకోవడం లేదు. కానీ ఈ నిధులు వేరే వైపు మళ్లించడంతో ఈ రోడ్డు నిర్మాణానికి అడుగులు పడలేదు. గత ప్రభుత్వ హయాంలో ఈ మార్గంలో బీటీ రోడ్డు వేయాలని డీఎంఎఫ్ నిధుల కింద రూ.198 కోట్ల నిధులతో ప్రతిపాదనలు తీసుకువచ్చారు. కానీ యాదగిరిగుట్ట మండలం చొల్లేరు–చీమలకొండూర్ గ్రామాల మధ్య ఉన్న మట్టి రోడ్డుతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈరెండు గ్రామాల మధ్య మూడు కిలోమీటర్ల దూరం ఉంటుంది. వర్షాకాలంలో ఈ రోడ్డు గుంతలు పడి, పూర్తిగా బురదమయంగా మారుతుంది. రాత్రి వేళల్లో గుంతలు కనబడక ప్రమాదాలు చోటుచేసుకున్న ఘటనలు ఉన్నాయి.



గుంతలమయంగా మారిన చొల్లేరు–చీమలకొండూర్ మట్టి రోడ్డు

తగ్గనున్న దూరభారం

బీటీ రోడ్డు నిర్మాణం చేపడితే, మోత్కూర్, ఆత్మకూరు, వలిగొండ చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులు, వాహనదారులకు ఆలేరు, జనగాం ప్రాంతాలకు వెళ్లడానికి సుమారుగా 15 కిలోమీటర్ల దూరం తగ్గుతుంది. రోజువారి పనులు చేసుకునే, రైతులకు, చొల్లేరు పాఠశాలకు వెళ్లే విద్యార్థులకు ప్రయోజనం కలగనుంది.

అవస్థలు పడుతున్నాం



చీమలకొండూర్ గ్రామం నుంచి చొల్లేరు రావడానికి మట్టి రోడ్డుతో ఇబ్బందులు పడుతున్నాం. నిత్యం వివిధ పనుల నిమిత్తం మా వ్యవసాయ బావుల వద్దకు, చొల్లేరుకు రాకపోకలు సాగిస్తాం. మట్టి రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారింది. రాత్రి వేళల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి రోడ్డు వేయాలి.

– మహేష్, ప్రయాణికుడు, చీమలకొండూర్

బీటీగా మార్చాలి



చొల్లేరు–చీమలకొండూర్ గ్రామాల మధ్య బీటీ రోడ్డు వేయాలి. రోడ్డు నిర్మిస్తే మోత్కూర్, వలిగొండ ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులకు ఆలేరు ప్రాంతానికి వెళ్లే ప్రయాణికులకు మార్గం సుగమం అవుతుంది. విద్యార్థులకు, వ్యవసాయ బావుల వద్దకు వెళ్లే రైతులకు అవస్థలు తప్పుతాయి.

– తోటకూరి బీరయ్య, మాజీ సర్పంచ్, చొల్లేరు